

హైదరాబాద్ అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా ముకుందరెడ్డి , హైదరాబాద్ ఆర్డీవోగా రామకృష్ణ, సికింద్రాబాద్ ఆర్డీవోగా సాయిరాం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మర్యాదపూర్వకంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిశారు.

- సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ)


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 31 అక్టోబర్ 2024 | HYDERABAD




## చేవెళ్ల ఎంపీ కనిపించడం లేదు

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి 6 నెలలుగా కనిపించడంలేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, చేవెళ్ల నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో సీఐ భూపాల్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. -చేవెళ్లటౌన్



## పటాకులతో జర పైలం


సిటీబ్యూరో: దీపావళి పండుగ జీవితాల్లో వెలుగులు నింపాలి. కానీ నిర్లక్ష్యం, చిన్నపాటి తప్పిదాలతో కొందరు కంటి చూపును కోల్పోయి జీవితాన్ని అంధకారం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో చిన్నపాటి జాగ్రత్తలు, అప్రమత్తతో దీపావళిని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలంటూ.. ప్రజలకు సూచిస్తున్నారు కంటి వైద్యనిపుణులు. ఈ దీపావళి సమయంలో ప్రజలు, చిన్నారులు జాగ్రత్తలు పాటించి, ఆనందంగా పండుగను జరుపుకోవాలని సరోజిదేవి కంటి దవాఖాన మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్ గౌడ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### జాగ్రత్తలివి..

- మైదానాలు, ఖాళీ స్థలాల్లో మాత్రమే పటాకులు కాల్చాలి.
- పిల్లలు పటాకులు కాల్చే సమయంలో పెద్దవారు కచ్చితంగా వెంట ఉండాలి. పిల్లలను ఒంటరిగా పటాకులను కాల్చనివ్వద్దు.
- పటాకులను కాల్చే సమయంలో కండ్లకు ప్రొటెక్టడ్ గ్లాసెస్‌ను పెట్టుకోవడం ఉత్తమం.
- దీపాలకు దగ్గరగా పటాకులను పెట్టరాదు.
- పొడవైన పూల చెడితో మాత్రమే పటాకులను పేల్చడం చేయాలి.
- పటాకులను నేరుగా అగ్గి పుల్లతో లేదా కాగితాలతో అంటించడం ప్రమాదకరం.
- కాల్చిన వెంటనే పటాకుల వద్ద వెళ్లి చూడొద్దు. అవి కొన్నిసార్లు పేలిపోవడం వల్ల ప్రమాదం జరగొచ్చు.
- తారాజువ్వలు, రాకెట్లు, చిచ్చుబుడ్లు వంటివి పైన రంగుల వెలుగులు వెదజల్లుతున్న సమయంలో వాటిని పైకి ముఖం పెట్టి చూడకూడదు. అలా చేయడం వల్ల వాటి నుంచి వెలువడే నిప్పు రవ్వలు కండ్లలో పడి చూపు దెబ్బతినే ప్రమాదమున్నది
- నాణ్యమైన, గుర్తింపు గల కంపెనీలకు చెందిన పటాకులను మాత్రమే కొనుగోలు చేయాలి.
- చిచ్చుబుడ్లు, రాకెట్లు, పూల చడీలను వెలిగించే సమయంలో వాటిని తలకు దూరంగా పెట్టి వెలిగించాలి.కాలిపోయిన వెంటనే వాటికి దగ్గరగా ముఖం పెట్టి చూడటం చాలా ప్రమాదకరం.
- పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ డిపోలు, గుడిసెలు, తాటిపత్రాలతో కట్టిన దుకాణాలు, మండే సామర్థ్యం గల దుకాణాలు, ఇతర కేంద్రాల వద్ద పటాకులను కాల్చరాదు.
- ముందుజాగ్రత్తగా దగ్గరలో కనీసం రెండు బక్కెట్ల నీటిని అందుబాటులో పెట్టుకోవాలి.
- చిన్నచిన్న కాలిన గాయాలు జరిగిన వెంటనే గాయంపై నీటిని పోయాలి. ఒంటికి మంటలు అంటుకున్న సందర్భంలో శుభ్రమైన కాటన్ బెడ్‌షీట్, దుప్పటితో బాధితులకు మంటలను ఆర్పివేసి ఆస్పత్రికి తరలించాలి.

గ్రేటర్‌లో ఆక్రమణలపై బుల్డోజర్లు నడిపిన హైడ్రా.. ఇప్పుడు కొన్ని శాఖల అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నది. ముఖ్యంగా రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారుల్లో కొందరు హైడ్రా ఎప్పుడేం చేస్తుందోనని హడలెత్తిపోతున్నారు. ఇటీవల హైడ్రా కూల్చివేతలకు సంబంధించిన వ్యవహారంలో ఆక్రమణలకు సహకరించారంటూ ఆరుగురు ముఖ్య అధికారులపై హైడ్రా కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత జరిగిన కూల్చివేతలకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో ఆక్రమణలకు ఎవరెవరూ సహకరించారన్న దిశగా హైడ్రా ఆరా తీసింది. ఇప్పటి వరకు సుమారు 50 మందికి పైగా అధికారులు.. మరో 30 మంది సిబ్బంది ఈ అడ్డగోలు అనుమతుల్లో కీలకపాత్ర పోషించినట్లు తేల్చింది. అయితే ఆధారాలతో 23 మందిపై కేసులు పెట్టేందుకు కమిషనర్ రంగనాథ్ ప్రభుత్వాన్ని అనుమతి కోరినట్లు తెలిసింది. సాధారణ ఉద్యోగులు కాకుండా డీసీ, ఏసీ, సీపీలు కాకుండా హెచ్ఎండీఏకు సంబంధించిన ముఖ్య అధికారులు కూడా జాబితాలో ఉండటం గమనార్హం.

-సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ)




హైడ్రా హడల్

# అధికారుల గుండెల్లో హైడ్రా గుబులు

## 23 మందిపై వేలాడుతున్న కత్తి!

### ఫిర్యాదుకు సిద్ధమైన హైడ్రా కమిషనర్ • వివిధ శాఖల్లో కలకలం రేపుతున్న చర్యలు

హైడ్రా నేతృత్వంలో ఇప్పటివరకు కూలగొట్టిన అక్రమ కట్టడాల విస్తీర్ణం 111 ఎకరాలుగా ఉంది. రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏల్లో పనిచేస్తున్న అధికారుల్లో ఎవరెవరూ ఎన్ని కట్టడాలకు పర్మిషన్లు ఇచ్చారు. వీటిలో ఎవరి పాత్ర ఏంటనే కోణంలో హైడ్రా ఆరా తీసింది. ఇందులో అధికారులతో పాటు సిబ్బంది కీలక పాత్ర పోషించినట్లు తేల్చింది. ఇప్పటివరకు ఆరుగురిపై ఫిర్యాదు చేసిన హైడ్రా కమిషనర్.. ప్రస్తుతం మరో 23 మందిపై ఫిర్యాదు చేయడానికి లిస్ట్ రెడీ చేసినట్లు తెలుస్తున్నది. వీరిలో ఎక్కువగా రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ సిబ్బంది ఉండగా, ఇద్దరు రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. ఆక్రమణలకు సంబంధించి కొందరు రిటైర్డ్ అధికారులు ముఖ్యపాత్ర పోషించినట్లు హైడ్రా తేల్చింది. ఉద్యోగులు రిటైరయినా..వారి అక్రమాలపై కచ్చితంగా రిపోర్ట్ తయారు చేసి ఆక్రమణల విషయంలో వారి పాత్రకు సంబంధించి పూర్తి వివరాలతో కేసులు పెట్టాలని ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో చెరువుల ఆక్రమణల్లో ఉన్న కంపెనీల్లో ఎక్కువగా రెరా, హెచ్ఎండీఏ అనుమతి వెంచర్లు ఉండటంతో అక్కడ జరిగిన అక్రమాలపై ఆరా తీసిన హైడ్రా కమిషనర్.. హెచ్ఎండీఏ అధికారుల్లో ఎవరెవరిపై చర్యలు తీసుకోవాలి.. ఎవరిపై ఎటువంటి కేసులు పెట్టాలనే విషయమై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నారు.




#### గతంలోనే ఆరుగురిపై కేసులు

శాటిలైట్ చిత్రాల ప్రకారం ఓఆర్ఆర్ లోపల ఆక్రమణకు గురైన చెరువులు, కుంటలు, పార్కుల జాబితా తయారు చేసిన హైడ్రా.. ఆతర్వాత ఇందుకు కారకులెవరనే విషయంపై ఆరాతీసింది. ఈ ఆక్రమణలకు అడ్డగోలుగా అనుమతిలిచ్చినట్లు గుర్తించారు. ప్రాథమిక ఆధారాల మేరకు మొత్తం ఆరుగురు అధికారులపై హైడ్రా గతంలోనే ఫిర్యాదు చేసింది. ఇందులో చందానగర్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎం.రాజ్‌కుమార్, చందానగర్ సర్కిల్ 21 డిప్యూటీ కమిషనర్ ఎన్ సుధామ, నిజాంపేట మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, బాచుపల్లి ఎమ్మార్వో పూల్‌సింగ్, హెచ్ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సుధీర్‌కుమార్, మేడ్చల్ జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ కె. శ్రీనివాసులుపై కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం వీరిపై దర్యాప్తు జరుగుతున్నది. వీరే కాకుండా మరికొంతమంది పాత్రపై కూడా హైడ్రా ఆరా తీసింది. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో అడ్డగోలుగా అక్రమ కట్టడాలకు అనుమతులిచ్చిన అధికారులపై దృష్టి పెట్టింది. హెచ్ఎండీఏ పరిధిలో లేఔట్ల విషయంలోనూ తప్పుడు మ్యాపుల ఆధారంగా అనుమతులిచ్చారన్న ఆరోపణలున్నాయి. అంతేకాకుండా రెవెన్యూ, ఇరిగేషన్ ఇచ్చిన ఎన్ఓసీ ఆధారంగా చేసుకునే అనుమతులిచ్చిన పరిస్థితులూ ఉన్నాయి.

# మళ్లీ.. మళ్లీ టెండర్లు

## ముందుకు రాని కాంట్రాక్టర్లు

### నాలా అభివృద్ధి పనులకు స్పందన కరువు

### బల్దియా పనులంటేనే జంకుతున్న కాంట్రాక్టర్లు

### సకాలంలో బిల్లులు రావనే అపవాదే కారణం




మురుగు ముంపునకు పరిష్కారంగా ప్రతిపాదించిన వరద ప్రవాహ వ్యవస్థ మెరుగుదల జీహెచ్ఎంసీకి సవాల్‌గా మారింది. నాలా అభివృద్ధి పనులంటేనే కాంట్రాక్టర్లు జడిసిపోతున్నారు. దీనికి కారణం బల్దియాలో పనులు చేస్తే సకాలంలో బిల్లులు రావడం లేదన్న అపవాదు బలంగా ఉండటమే. గడిచిన కొన్ని నెలలుగా రూ. 1400 కోట్ల బకాయిలపై కాంట్రాక్టర్లు జీహెచ్ఎంసీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ.. తమ నిరసన గళాన్ని వినిపిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జీహెచ్ఎంసీ నాలా అభివృద్ధి పనుల టెండర్లకు కాంట్రాక్టర్ల నుంచి స్పందన రావడం లేదు.

-సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ)

ఒక్కొక్క పనికి రెండు, మూడు సార్లు టెండర్లు పిలుస్తున్న పరిస్థితి. సుమారు 542 కోట్లతో 43 ప్రాంతాల్లో 58 కిలోమీటర్ల మేర నాలా అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించిన బల్దియా ఈ మేరకు టెండర్లు పిలిచింది. ఇందులో ఇప్పటివరకు తొమ్మిది చోట్ల మాత్రమే పనులు ప్రారంభమవ్వగా, విడతల వారీగా టెండర్లు పిలుస్తూ వస్తున్నారు. తాజాగా, కూకట్‌పల్లి, పటాన్‌చెరు, చందానగర్, చాంద్రాయణగుట్ట ప్రాంతాల్లో నాలా అభివృద్ధి టెండర్లు పిలిచారు. ఎక్కువ శాతం ఈ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అధికారులు సందిగ్ధంలో పడ్డారు. సకాలంలో పనులు ప్రారంభించి, వరద ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అధికారులు.. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పరిస్థితులతో ఏం చేయాలో పాలుపోవడం లేదంటూ కొందరు ఇంజినీర్లు చెబుతున్నారు.

#### రూ. 30 కోట్ల లోపే..

ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ పథకాల స్థానంలో కాంగ్రెస్ సర్కారు 'హెచ్ సిటీ'(హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్, ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)కి రూపకల్పన చేసింది. ఇందులో కేవలం తొమ్మిది ప్రాంతాల్లో పనులు మొదలు కావడం, ఇందులో అత్యధికంగా రూ. 30 కోట్ల లోపు మాత్రమే ఉండటం గమనార్హం. పనులు ప్రారంభమైన వాటిని పరిశీలిస్తే చార్మినార్ జోన్‌లోని మౌలా కా చిల్ల నుంచి హైదరాబాద్ ఇస్లామిక్ పాఠశాల వరకు రూ.6.5 కోట్లతో బాక్స్ డ్రైన్, బండ్లగూడ జేఎన్ఎన్‌యూఆర్ఎం హౌసింగ్ నుంచి ఎర్రకుంట వరకు రూ. 33 కోట్లు బాక్స్ డ్రైన్, సన్నీ గార్డెన్ నుంచి శివాజీనగర్ వరకు ముర్కీ నాలాకు ఇరు వైపులా రిటైనింగ్ వాల్ రూ. 27.5 కోట్లు, నూరమ్మ చెరువు నుంచి మీరాలం ట్యాంక్ వరకు రూ. 53.35కోట్లు, అరుంధతినగర్ నుంచి అక్బర్‌నగర్ ఎగువకు రిటైనింగ్ వాల్ రూ.9.9 కోట్లు, కిషన్‌బాగ్ రోడ్డులో మాజీద్ కిరాణా స్టోర్ నుంచి మూసీ వరకు వాల్ రూ.7.7 కోట్లతో పనులు జరుగుతున్నాయి. టెండర్ దశలో కేకే గార్డెన్ నందనపురి కాలనీ వరకు రూ. 7.49కోట్లతో డ్రైన్, శేరిలింగంపల్లి జోన్‌లో గఫూర్‌నగర్ జంక్షన్ నుంచి దుర్గం చెరువు ఎంట్రీ ప్లాజా వరకు ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్ రూ.11.55 కోట్లు, అంబేద్కర్ కాలనీ నుంచి శిశుమందిర్ ఏరియా రూ.6 కోట్లు, జనార్దన్ హిల్స్ నుంచి ఖాజాగూడ పెద్ద చెరువు యురో కిడ్స్ వరకు డ్రైన్ పనులకు రూ.14 కోట్లతో టెండర్ పిలిచారు. తాజాగా, మరిన్ని చోట్ల పనులకు టెండర్లు పిలిచారు. ఇదిలా ఉంటే ఈ వర్షాకాలంలో కొత్తగా ఏ ఒక్క ప్రాంతంలో వరద ముంపు సమస్యను తప్పించలేక పోయారంటూ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం వాయువేగంతో ఎస్ఎన్‌డీపీ పథకాన్ని తీసుకొచ్చి.. రూ.985.45కోట్లతో మొదటి విడత పనులు చేపట్టింది. రూ.592.68 కోట్లు ఖర్చు పెట్టి 39 చోట్ల పనులను పూర్తి చేసి ముంపు సమస్యలు తొలగించిందని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.



## హైడ్రా బాధిత చిన్నారులకు సాయం

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సున్నం చెరువు పరీవాహక ప్రాంతంలో ఇటీవల హైడ్రా ఇండ్లను కూల్చివేసింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సొంత నిధులతో సమకూర్చిన స్కూల్ బ్యాగులు, పెన్నులు, పుస్తకాలను బుధవారం అక్కడి బాధిత పిల్లలకు కార్పొరేటర్ సబిహాబేగం అందజేశారు.

-అల్లాపూర్

## ట్రాఫిక్ కంట్రోలింగ్‌లో హైడ్రా వలంటీర్లు

సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు హైడ్రా కసరత్తు ప్రారంభించింది. నగరంలోని ట్రాఫిక్ జామ్ అయ్యే ప్రాంతాలపై దృష్టి పెట్టింది. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులతో పాటు హైడ్రా ట్రాఫిక్ వలంటీర్లు కూడా పనిచేస్తారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పనిచేసే దిశగా హైడ్రా ట్రాఫిక్ వలంటీర్ల పేరుతో డీఆర్ఎఫ్ సిబ్బందికి ట్రాఫిక్ నియంత్రణపై శిక్షణ ఇప్పించారు. బుధవారం నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా హైడ్రా వలంటీర్లు విధులు నిర్వహించారు. గోషామహల్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్‌సెంటర్లో 50 మంది హైడ్రా బృందానికి శిక్షణ ఇచ్చారు. అనంతరం వలంటీర్లు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద పనిచేశారు. ట్రాఫిక్‌ను నియంత్రించడం, సిగ్నల్స్ వద్ద వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు రద్దీ ప్రాంతాల్లో వాహనాలు నిలువకుండా సాఫీగా వెళ్లేలా చూశారు.



## ఓటీఎస్ అమలులో నిర్లక్ష్యం

# ఈడీ సీరియస్

### ఐటీ అధికారుల వివరణ కోరిన మయాంక్

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో: దీర్ఘకాలికంగా నల్లా పెండింగ్‌లో ఉన్న వినియోగదారుల సౌకర్యార్థం అందుబాటులోకి వచ్చిన ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) అమల్లో ఐటీ అధికారుల నిర్లక్ష్యంపై జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ సీరియస్ అయ్యారు. సాంకేతిక సమస్యలు తరచూ ఎందుకు వస్తున్నాయంటూ బుధవారం అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటీఎస్ ఆమల్లో ఐటీ విభాగం మరింత పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నల్లా బిల్లు చెల్లిస్తే ఆలస్య రుసుముతోపాటు వడ్డీపై రాయితీ పొందాలని వినియోగదారులకు సూచిస్తూ ఈ నెల 4న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా.. 17 రోజుల తర్వాత (ఈ నెల 22వ తేదీ)న జలమండలి అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే వినియోగదారులు ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకునేందుకు ప్రతి డివిజన్ నుంచి రోజుకు 30 నుంచి 50 మంది వస్తుండటం, వారం రోజుల కిందట బకాయి మొత్తం చెల్లించిన మాఫీ అయినట్లు చూపించడం లేదంటూ వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవంగా మేనేజర్ నుంచి డీజీఎం, జీఎం, సీజీఎం స్థాయిలో నిర్దేశించిన బిల్లును సంబంధిత అధికారి అప్రూవల్ చేసే ప్రక్రియలో సాంకేతిక సమస్య రావడంతో ఈ ఆందోళనకు కారణమైంది. ఈ అంశాలన్నింటిని ప్రస్తావిస్తూ మంగళవారం 'నమస్తే తెలంగాణ' కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన ఈడీ.. సంబంధిత రెవెన్యూ, ఐటీ అధికారుల నుంచి సమగ్ర వివరాలను ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. బుధవారం సైతం కొన్ని డివిజన్లలో సాంకేతిక సమస్యలు తప్పలేదు. అఫిడవిట్ సమర్పించగా..అప్రూవల్ చేసే క్రమంలో సాఫ్ట్‌వేర్‌లో 100 ఎంబీ (అఫిడవిట్ పీడీఎఫ్ ఫైల్) కంటే ఎక్కువగా ఉంటే ఇబ్బందులు రావడం, ఆన్‌లైన్ అప్రూవల్‌పై అధికారులు పూర్తి స్థాయి అవగాహన లేకపోవడంతో వినియోగదారుల బిల్లు మాఫీపై స్తబ్ధత నెలకొంది.

మొత్తంగా వరుస పండుగల సమయంలో ఓటీఎస్ రావడం, అధికారుల నిర్లక్ష్యంతో పూర్తి స్థాయి అమలు కాకపోవడం, చివరి 9 రోజుల సమయంలో ఆశించిన స్థాయిలో వినియోగదారులు సద్వినియోగం చేసుకోకపోవడం, మరో నెల పాటు అధికారులు సమయం కోరడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. మరో నెల పాటు సమయం ఇస్తారా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే.

# ఎల్ ఆర్ఎస్‌పై నీలినీడలు!

- పెండింగ్‌లోనే దరఖాస్తులు
- హైడ్రా, జీపీ లేఔట్ల నిషేధం.. పట్టించుకోని అధికారులు
- అర్జీదారుల ఆందోళన

సిటీబ్యూరో: ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిస్థితి సందిగ్ధంలో పడింది. హెచ్ఎండీఏ పరిధిలో క్రమబద్ధీకరణకు వచ్చిన దాదాపు మూడున్నర లక్షల అర్జీలపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. హైడ్రా, జీపీ లేఅవుట్ల నిషేధం వంటి చర్యలతో దరఖాస్తులను అధికారులు పట్టించుకోవడం లేదు. హైడ్రా అందుబాటులోకి రావడంతో ఇప్పటికే ఫీజులు చెల్లించిన దరఖాస్తుదారులు కూడా ఆందోళన చెందుతున్నారు. తాజాగా జీపీ లేఅవుట్లలో రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంతో... ఇప్పటికే ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్నది.

#### పెండింగ్‌లో 3.60 లక్షల దరఖాస్తులు

హెచ్ఎండీఏ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 3.60 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విషయంలో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.ఇందులో 1.16 లక్షల దరఖాస్తులను పరిశీలించారు. వీటిలో 1.12 లక్షల దరఖాస్తుల్లో ఉన్న లోపాలను వివరిస్తూ అధికారులు షార్ట్ ఫాల్ చేయగా... 653 అర్జీలను తిరస్కరించారు. ఇప్పటికే ప్రిలిమినరీ ఎలిమినేషన్ ప్రక్రియ ముగియగా... ఫీజులు చెల్లించిన దరఖాస్తులను పరిశీలించి షార్ట్ ఫాల్స్ పేర్కొంటూ దరఖాస్తుదారులకు సమాచారం ఇస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం అమలు చేస్తున్న చర్యలు అధికారులను గందరగోళంలో పడేస్తున్నాయి. దీంతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నారు.



#### ఉచితంగా ఎల్ఆర్ఎస్ హామీ..

నిబంధనలకు విరుద్ధంగా అభివృద్ధి చేసిన ఓపెన్ ప్లాట్లను క్రమబద్ధీకరించి, ఆయా ప్లాట్లుకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పించాలనే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరించింది. కానీ ప్రతిపక్ష హోదాలో అప్పటి సర్కారు నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. అక్కడితో ఆగకుండా... అధికారంలోకి వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేసి ఇస్తామంటూ హామీ ఇచ్చింది. అలా అధికారం చేపట్టిన తర్వాత పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఖజానా నింపే కామధేనువుగా మార్చుకునేందుకు ప్రయత్నాలు చేసింది. కానీ క్షేత్రస్థాయిలో జనాల నుంచి తీవ్ర వ్యతిరేకత మొదలైంది. దరఖాస్తులను వేగంగా పరిశీలించాలనే ప్రభుత్వం మౌఖికంగా ఆదేశాలు కూడా జారీ చేసింది. కానీ పేదలపై ఆర్థిక భారం పడుతుందని రియల్ ఎస్టేట్ వర్గాలు మాత్రం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలని డిమాండ్ చేస్తున్నది.




## పండుగ తిప్పల్

దీపావళి నేపథ్యంలో నగరవాసులు సొంతూళ్లకు బయలుదేరడంతో బుధవారం ఉప్పల్ చౌరస్తాలో ఇలా రద్దీ కనిపించింది. సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.